
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# ఏకైక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 26 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA_533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :** J. C. CHOATE | **Managing Editor :** JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 9 | అక్టోబరు 1988 | సంచిక 3


## సంపాదకీయము

### ప్రేమ అంటే యేమిటి?

( *What is Love?* )

ప్రేమను గూర్చి మనం తరుచు మాట్లాడుకొంటాము. బోధకులు తమ ప్రసంగాలలో ప్రేమను గూర్చి చెబుతారు. అయితే చాల మందికి అది అర్థరహితమైనది. ప్రేమ అంటే వారికి తెలియదు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిర్లక్ష్యం చేస్తారు, బానిసలవలె వారిని చూస్తారు. భర్తలు భార్యలయెడల కౄరంగా ప్రవర్తిస్తారు. గనుక ...టి పరిష్కార మేమిటి?

మొదటిగా, ప్రేమంటే యేమిటో నిర్వచిందాము. వివిధ రకాల ప్రేమ యున్నది. ప్రేమ భౌతికమైనదని చాల మంది భావిస్తారు. అది అనురాగం, లైంగికం, శృంగారం మొదలైనదని వారు భావిస్తారు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు, పిల్లలు మొదలైన వారి యెడల మనకున్న ప్రేమ ఇంకో రకమైనది. అయితే అతి శ్రేష్ఠమై

నట్టియు, ఉన్నతమైనట్టియు ప్రేమనుగూర్చి మనం ఇప్పుడు తెలిసి కొందాము. అన్ని సందర్భాలలోను వేరొకని క్షేమమును కోరు ప్రేమ యిది. ఇది అగాపే (Agape) ప్రేమ.

దీనికి ఉదాహరణగా మానవుని యెడల దేవునికున్న ప్రేమను గూర్చి ఆలోచించుము. 1 యోహాను 4:8 లో, "దేవుడు ప్రేమా స్వరూపి; ప్రేమ లేనివాడు దేవుని ఎరుగడు" అని వ్రాయబడి యున్నది. దేవుడు మనలను ప్రేమించి తన కుమారుని మనకొరకు అనుగ్రహించి యున్నాడు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశియింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). "లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవు డాయనను లోకములోనికి పంపలేదు" (యోహాను 3:17). "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమ యున్నది" (1 యోహాను 4:10). ఆయనే ముందు మనలను ప్రేమించాడు గనుక మన మాయనను ప్రేమించాలి (1 యోహాను 4 : 19).

తరువాత, మనకొరకు తన్ను తాను అప్పగించుకొనుటలో క్రీస్తు మనలను ఎట్లు ప్రేమించాడో తెలిసికొందము. "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడని" చెబుతు యేసు దానిని వివరించాడు (యోహాను 15:13). పౌలు ఇట్లన్నాడు : "ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివాని

కొరకు ఎవడైన ఒకవేళ తెగింపవచ్చును. అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింక పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" (రోమా 5:6-8). ఈ లేఖనములను బట్టియు, మరియు అనేక లేఖనములను బట్టియు క్రీస్తు మనలను ప్రేమించాడని చెప్పుటయే గాక, ఆయన దానిని నిరూపించినట్లు చూడగలము. అంతేకాదు ఆయన కేవలము నీతిమంతులకొరకే కాదు, భక్తిహీనులకొరకును చనిపోయెను. ప్రేమ అంటే అది.

ప్రభువు మనలను ప్రేమించి దానిని నిరూపించినను, మనము ఆయనను ప్రేమించాలని ఆయన కోరుచున్నాడు. ఆజ్ఞలన్నిటిలో ముఖ్యమైనదేదని ప్రభువును ఒకడు అడుగగా, "అందుకాయన నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలె ననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే" (మత్తయి 22:36-39). ప్రభువును మనం ప్రేమించుచున్నట్లు ఎట్లు నిరూపించగలము ? ఆదిమ శిష్యులకు దాని జవాబును క్రీస్తు ఇట్లు వివరించాడు : "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15). ప్రభువు మనయెడల తన చిత్తాన్ని బయలుపరచాడు. గనుక దానిని మనం తెలిసికొని ఆయన ఆజ్ఞలకు లోబడాలి. ఆయన ఆజ్ఞలకు లోబడకుండా ఆయనను ప్రేమించుచున్నామని ఎట్లు చెప్పగలము? చెప్పలేము.

మరల మనం మన పొరుగువానిని ప్రేమించాలి. అంటే మన సహాయం అవుసరమైన వారిని ప్రేమించాలి. మనం మిత్రులను, కుటుంబ సభ్యులను, తలిదండ్రులను, భర్తలను, భార్యలను, కుమారులను, కుమార్తెలను కూడ ప్రేమించాలి.

మనం ఆయన సంఘాన్ని, మన నాయకులను, బోధకులను, ఉపదేశకులను, సహోదరులను ప్రేమించాలి (1 పేతురు 2:17). "మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిని బట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురని" క్రీస్తు ప్రభువు చెప్పాడు (యోహా 13:35).

చివరిగా మనం నశించుచున్నవారిని, మన శత్రువులను కూడ ప్రేమించాలి. క్రీస్తు ఇట్లన్నాడు: "నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించువారి కొరకు ప్రార్థన చేయుడి" (మత్త 5:44). అయితే శత్రువులను, మనం ఎన్నడు చూడనివారిని ప్రేమించగలమా? సాధారణంగా మనం ఎరిగిన వారినే ప్రేమిస్తాము. అయితే మన విరోధులను, అందులోను ఎన్నడు చూడనివారిని ఎట్లు ప్రేమించగలము? ఒకడు మనకు విరోధియైనను సరే అతని క్షేమాన్ని కోరే 'అగాపే' ప్రేమనుగూర్చి మనం యోచించుచున్నామని గ్రహించుడి. దీనిని మనసులో యుంచుకొని అట్టి వారికి కూడ మనం మేలు చేయాలి. ఈ సంగతుల విషయమై పౌలు చెప్పిన మాటలను వినుడి: "మీ ప్రేమ నిష్కపటమైనదై యుండవలెను. చెడ్డదాని నసహ్యించుకొని మంచిదానిని హత్తుకొని యుండుడి. సహోదర ప్రేమ విషయంలో ఒకనియం దొకడు అనురాగముగలవారై ఘనత విషయములో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి. ఆసక్తి విషయములో మాంద్యులు కాక ఆత్మయందు తీవ్రతగలవారై ప్రభువును సేవించుడి. నిరీక్షణగలవారై సంతోషించుచు శ్రమయందు ఓర్పుగలవారై ప్రార్థనయందు పట్టుదల కలిగి యుండుడి. పరిశుద్ధుల అవసరములలో పాలు పొందుచు, శ్రద్ధగా ఆతిథ్యము ఇచ్చుచుండుడి. మిమ్మును హింసించువారిని దీవించుడి; దీవించుడి గాని శపింపవద్దు. సంతోషించువారితో సంతోషించుడి.

ఏడ్చువారితో ఏడువుడి; ఒకనితో నొకడు మనస్సు కలిగియుండుడి. హెచ్చువాటియందు మనస్సుంచక తగ్గువాటియందు ఆసక్తులై యుండుడి. మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు. కీడుకు ప్రతి కీడెవనికిని చేయవద్దు; మనుష్యు లందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగియుండుడి. శక్యమైతే మీ చేతనై నంతమట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా ఉండుడి. ప్రియులారా మీకు మీరే పగ తీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటియ్యుడి - పగ తీర్చుట నా పని నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడి యున్నది. కాబట్టి నీ శత్రువు ఆకలి గొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింపబడక, మేలుచేత కీడును జయించుము" (రోమా 12:9-21).

మన శత్రువుకు కూడ మేలుకరమైన, అతనికి క్షేమకరమైన, సంగతులను చేయుటద్వారా మన మతని ప్రేమించాలి. అట్లే ఈ లోకంలో మనం వ్యక్తిగతంగా ఎరుగనివారిని కూడా ప్రేమించాలి. వారు దేవుని చిత్తాన్ని తెలిసికొని సువార్తకు లోబడి క్రైస్తవులు కాగల్గునట్లు వారికి సువార్త నందించాలి. అదీ ప్రేమ అంటే.

నీకున్న ప్రేమ యెట్టిది? నీ పొరుగువారిని, నీ శత్రువులనుకూడా ప్రేమించగలవా ? ప్రయత్నించు. అది చాల సంతృప్తికరమైనది. మనందరం దేవుని ప్రేమను మన జీవితంలో అలవరచుకొనాలి. దాన్ని మనం అలవరచుకొనేకొలది మనల్ని మారుస్తాది, ఈ లోకాన్ని మారుస్తాది.

# ఆది - అంతము

మహిమగల దేవుని చిత్తము మనము తెలిసికొనుటకు లేఖనములే ఆధారం. బెరయులోని క్రైస్తవులు పౌలు సీలలు చెప్పిన సుబోధ సంబంధమైన సంగతులు అట్లున్నవో లేదో యని లేఖనములను పరిశీలించెడివారని వ్రాయబడి యున్నది. వాక్యమును అంగీకరించినవారు ప్రతి దినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి (అ.కార్య. 17:11). పరిశుద్ధ గ్రంథమును కలిగియున్నవారు అందలి భావములు పఠించుట మాత్రమే గాక, పరిశోధించిన మరి యెక్కువ భాగములు గ్రాహ్యమగును. అయితే చాలమంది బైబిలు పాఠకులు గ్రంథములోని కొన్ని పుస్తకములు ఎక్కువగా చదువుట కిష్టపడరు. యెహెజ్కేలు, యూదా, ప్రకటన గ్రంథములజోలికి పోకుండునట్లు అపవాది అడ్డగించుచున్నాడు. ప్రతి భాగమును మనం ప్రార్థనాపూర్వకముగా చదువుచున్నప్పుడు మర్మమైయున్న సత్యము ప్రత్యక్షమగుచుండును.

మనమిప్పుడు ఆదికాండము - ప్రకటన గ్రంథములను పరిశీలించుదము. ఆదికాండములో ప్రారంభించబడిన వాటియొక్క అంతము ప్రకటన గ్రంథములో చూడగలము. ఇదియొక క్లుప్త పరిశీలన మాత్రమే !

ఆదికాండము నందు - భూమి ఆకాశము సృష్టిని మనం చూచుచున్నాము (1, 2 అధ్యా).

ప్రకటన గ్రంథములో - ఆకాశము భూమి గతించిపోయెనని చదువు చున్నాము (ప్రకటన 21:1).

ఆదికాండములో - సూర్యుడు చంద్రుడు సృష్టింపబడెను (1:16). సమస్త ప్రజలకొరకు పంచిపెట్టబడెను (ద్వితీ 4:19).

ప్రకటన గ్రంథములో - సూర్యుడు చంద్రుడు అక్కర లేకుండెను (21:23).

ఆదికాండమునందు చీకటిని వేరుపరచి 'రాత్రి' అను పేరుపెట్ట బడినది. 1:15.

ప్రకటన గ్రంథములో - రాత్రి కాలము యిక ఎన్నడు లేకుండెను. 22 : 5.

ఆదికాండములో - మానవుడు నివాసముండుటకు దేవుడు ఒక తోటను వేసెను. 2:8.

ప్రకటన గ్రంథములో - రక్షింపబడినవారికి రాజులు యాజులు నివాసముండుటకు పరిశుద్ధ పట్టణము నిర్మింపబడెను. అది దిగి వచ్చెను. 21 : 2-24.

ఆదికాండమునందు - మొదటి ఆదాము యొక్క వివాహమును చూచుచున్నాము. 2:22.

ప్రకటన గ్రంథములో - రెండవ ఆదాము (క్రీస్తు) యొక్క వివాహమును చూచుచున్నాము. 19 : 7.

ఆదికాండములో - ఏదెను తోటయందు అపవాది యుక్తిగల సర్పమై కన్పించును. 3 : 1.

ప్రకటన గ్రంథములో సాతాను ఘటసర్పమై అగ్నిగంధక ములుగల గుండములో పడవేయబడెను. 20 : 2-10.

ఆదికాండములో - పాపము నిమిత్తమై వచ్చిన శాపము కన్పించును. 3:14-17.

ప్రకటనగ్రంథములో-శాపగ్రస్తమైనదేదియు యుండదు. 22:3.

ఆదికాండములో - మానవజాతియొక్క దుఃఖము వేదన కన్నీరు కాన్పించును. 3:16-19.

ప్రకటన గ్రంథములో - దుఃఖము వేదన మరణము కన్నీరు యొక్క అంతము కానవగును. 21 : 3-4.

ఆదికాండములో - మానవుడు జీవవృక్ష ఫలములు తినకుండా ఏదెను తోటనుండి తరిమివేయబడెను. 3:24.

ప్రకటన గ్రంథములో - మానవుడు జీవవృక్షఫలములు తినుట కొరకు ఆహ్వానింపబడెను. 2 : 7; 22 : 14.

దేవుడు మనయెడల కలిగియున్న యుద్దేశమును చిత్తమును తెలిసికొనుటకు బైబిలు మనకు మార్గదర్శకమై యున్నది. ఈ గ్రంథము చదువువారును అందలి సంగతులు వినువారును నిజముగా ధన్యులే! కానీ, దేవుని చిత్తము కాని విషయములు బైబిలుకు జోడించి మనుష్య సిద్ధాంతములకు ప్రాముఖ్యత నిచ్చి, దేవుని ఘనపరచలేని వారికి, లేఖనములను అపార్థము చేసుకొను వారికి, దేవుడు కఠినదండన విధించును. (ప్రకటన 22:18-19). బైబిలును బాగుగా చదవండి. లేఖనములు పరిశోధించండి. క్రీస్తు రాజ్యమైన సంఘములో సభ్యత్వం పొంది దేవుని కుమారుని మహిమ పర్చండి.

—సామ్యూల్ జాన్ మేడిది,
కొణితివాడ.

---

## " మరణము వరకు నమ్మకముగా ఉండుము "

### (*Be Thou Faithful unto Death*)

మరణము వరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవకిరీటమును ఇచ్చెదను (ప్రకటన 2:10). ఈ వాగ్దానము అత్యంత ప్రాముఖ్యమైనది. ప్రతి క్రైస్తవుడు జీవకిరీటము పొందాలనీ, "క్రైస్తవుడుగా" ఉంటాడు. అంటే క్రైస్తవుల యొక్క నిరీక్షణ తాము చనిపోయిన తరువాత క్రీస్తు రాకడ సమయములో ఎత్తబడుదురనియు, బ్రతికిన వారు మార్పునొంది మధ్యాకాశములో క్రీస్తును కలుసుకుంటారని తమ దృఢ విశ్వాసము. ఇది యేసుక్రీస్తు చెప్పిన మాటయే గాని దీని వెంబడి కొన్ని నియమములు కూడా కలవు. వాటిలో ముఖ్యమైనది మరణము వరకు నమ్మకముగా ఉండడము అనునది.

ప్రతి క్రైస్తవుడు జీవకిరీటము పొందాలంటే మరణము వరకు నమ్మకముగా ఉండాలి. అనగా శ్రమలలోను, నిరుత్సాహ పరిస్థితుల లోను, శోధనలయందును, ఉన్నతస్థితి యందును మరియు దేవుని సేవించుట యందును నమ్మకముగా ఉండాలి. ఇలా అన్ని విషయాలలో మరణము వరకు నమ్మకముగా ఉంటేనే మనకు, మొదటివాడును కడపటివాడునై యుండి, మృతుడై మరలా బ్రతికినవాడు జీవకిరీటమును ఇచ్చును.

శ్రమలయందు (In Persecution) క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రతుక నుద్దేశించు వారందరు హింస పొందుదురు (2 తిమోతి 4:12). దేవుని వాక్యములో చెప్పబడిన రీతిగా మనము భక్తితో నీతిగా బ్రతుకునప్పుడు శ్రమలు తప్పనిసరిగా ఎదు రవుతాయి. ఇలా శ్రమలు కలిగినపుడు మనము మన భక్తి మార్గ మును విడువకూడదు. నీతిగా నిజాయితీగా బ్రతుకునప్పుడు మనలను దూషించడము అవమానపరచడము ఎగతాళి చేయుడము సహజము. ఎంత ప్రయత్నించినా వీటికి దూరముగా పోలేము. ఇటువంటి శ్రమలు కలిగినప్పుడు ఇవన్నియు యేసుక్రీస్తునకు నరావతారిగా ఈ లోకములో ఉన్నపుడు సంభవించినవని మరచిపోకూడదు. అయినను తన తండ్రి ఉద్దేశమును నెరవేర్చుటలో విఫలుడు కాలేదు. అదే విధముగా మనముకూడా శ్రమలయందు ఓర్పు కలిగి నమ్మకముగా ఉండాలి. యేసుక్రీస్తు ఇలా అన్నాడు - "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకు నప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి. పరలోకమందు మీ ఫలము అధికమగును" (మత్తయి 5:11, 12). మరియు పేతురు ఇలా వ్రాసాడు: "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచ వలెను" (1 పేతురు 4:16). కావున క్రైస్తవులు బాధలలో, శ్రమ

లలో హింసలలో మరణము వరకు నమ్మకముగా ఉండాలి. అప్పుడు జీవకిరీటము ఇవ్వబడును.

నిరుత్సాహ పరిస్థితులలో (In disappointments) :— మానవులమైన మనము మన జీవితములో అనేక నిరుత్సాహములను ఎదుర్కొంటాము. మన ప్రియులు, రక్తసంబంధులు, పిల్లలు చనిపోయి నప్పుడు ఎంతో బాధ నిరుత్సాహము కలుగుతుంది. క్రొత్తగా క్రైస్తవులైన వారిని పొరుగువారు ఇతరులు అనేక మాటలవలన వేధిస్తారు. మీరు క్రైస్తవులయినందుకే ఇలా జరిగిందని తిరిగి విగ్రహాలకు మొక్కాలని, ఇతర పద్ధతులు ఆచరించాలి, అప్పుడు ఇలాంటివి మీకు సంభవించవని మరికొందరు నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి పరిస్థితులలో కూడా మనము నమ్మిన దేవుడు సజీవమైనవాడు, సర్వశక్తి గలవాడని మర్చిపోకూడదు - ప్రభువా యెవనియొద్దకు వెళ్లుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు, నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగి యున్నామని (యోహాను 6 : 68, 69) పేతురు చెప్పిన మాటలు మనముకూడా చెప్పగలగాలి.

దావీదురాజు తన బిడ్డ జబ్బుపడినప్పుడు ఉపవాసముండి రాత్రి అంతయు నేలపడి బిడ్డ కొరకు దేవుని బతిమాలుతాడు. అతడు భోజనము చేయుటకు సమ్మతించడు. ఏడోదినమున బిడ్డ చనిపోతుంది. ఆ విషయము దావీదుకు తెలుపుటకు సేవకులు భయ పడుతారు. దావీదు తన బిడ్డ చనిపోయిన సంగతి గ్రహించి, భోజనము చేయును. అతని సేవకులు బిడ్డ జీవముతో ఉండగా ఉపవాసముండి దానికొరకు ఏడ్చుచుంటివి, గాని మరణమైనప్పుడు లేచి భోజనము చేసితివి. నీవు ఈలాగు చేయుట యేమని దావీదును అడిగినప్పుడు బిడ్డ ప్రాణముతో ఉండగా దేవుడు నా యందు కనికరించి వాని బ్రతికించు నేమో అనుకొని నేను ఉపవాసముండి ఏడ్చుచుంటిని. ఇప్పుడు చనిపో యుంది కనుక నేనెందుకు ఉపవాసముండవలెను? వానిని తిరిగి రప్పించ

గలనా? నేను వాని యొద్దకు పోవుదును గాని, వాడు మరల నాయొద్దకు రాడని వారితో చెప్పెను (2 సమూ 12:16-23). మరియు యోబు తన కుమారులు, కుమార్తెలందరు చనిపోయినప్పుడు యెహోవా ఇచ్చెను యెహోవా తీసుకొని పోయెను, యెహోవా నామమునకు స్తుతి కలుగునుగాక (యోబు 1:21) అని పలికెను. ఈ రెండు సందర్భాలలో ఇద్దరు వ్యక్తులు తమ పిల్లలను పోగొట్టుకున్నారు. అయినను వీరు దేవునిపై దృఢ విశ్వాసమును కనపరచు గొప్ప మాటలు పలికినారు. మనకు ఆ పరిస్థితి వచ్చినను వారివలె మనముకూడా నమ్మకముగా ఉండాలి. దేవుని దూషించడము, తమకు తాము హాని కలిగించుకోవడం వంటివి చేయకూడదు.

శోధనలయందు (In Temptations) : క్రైస్తవులైన వారికి శ్రమలు, నిరుత్సాహములు ఎలా కలుగుతాయో అంతకంటె యెక్కువగా శోధనలు కలుగుతాయి. మన విరోధియైన సాతాను ఎవరిని మ్రింగుదునా అని గర్జించు సింహమువలె తిరుగుచున్నాడు. కావున శోధనలు తప్పకుండా కలుగుతాయి. ఈ శోధనలు కలిగినప్పుడు వాటిని జయించాలి. మానవులము బలహీనులము కావున శోధనలకు లొంగిపోవుచున్నామని కొందరంటారు. క్రైస్తవుడు అలా అనకూడదు. యోసేపు శోధింపబడి ఫరో భార్యనుండి తప్పించుకున్నాడు. యేసుప్రభువు కూడ ముమ్మారు శోధింపబడి సాతానును ఎదిరించినాడు. యేసు, దేవుని వాక్యముతో సాతానును జయించినట్లు చూడగలము. అయితే సాతానుకూడ దేవుని వాక్యముతోనే శోధించినాడు. వాస్తవముగా నేడుకూడా అనేకులను సాతానుడు శోధించుచు వారిని తప్పుడు బోధలను నమ్మి వాటికి కట్టుబడి యుండేలాగున వారిని తప్పుడు త్రోవలలో నడిపించుచున్నాడు. కావున అందరు కూడా తమ తమ మార్గము దేవుని దృష్టిలో సరియైనదో లేదో పరీక్షించుకొనవలెను. దేవుని వాక్యము అనుదినము

పఠించడము వలన సాతానుయొక్క తంత్రములను ఎదిరించ గలము. మనము శోధించబడినప్పుడు యేసువైపు చూడవలెను. తాను శోధింపబడి శ్రమ పొందెను గనుక శోధింపబడు వారికి సహాయము చేయగలవాడై యున్నాడు (హెబ్రీ 2:18). దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు; ఆయన యెవనిని శోధింపడు గనుక యెవడైనను శోధింపబడునప్పుడు - నేను దేవునిచేత శోధింపబడుచున్నానని అన కూడదు. ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరలుకొల్పబడినవాడై శోధింపబడును (యాకోబు 1:11). కావున మనకు శోధన కలిగినప్పుడు శోధనను సహించి, పాపములో పడకుండా చూచుకోవాలి. ఇలా మరణము వరకు నమ్మకముగా ఉండడము వలన జీవకిరీటము పొందగలము.

**దేవుని సేవించడము (In Service) :–** దేవుని సేవించ డములోకూడా మరణము వరకు నమ్మకంగా ఉండాలి. యేసు చెప్పెను: ఒకడు నన్ను సేవించినయెడల నన్ను వెంబడింపవలెను. అప్పుడు నేను ఎక్కడ ఉందునో అక్కడే నా సేవకుడును ఉండును. ఒకడు నన్ను సేవించినయెడల నా తండ్రి అతనిని ఘనపరచును (యోహాను 12:36). అపొస్తలుడైన పౌలు నిర్మలమైన మనస్సాక్షితో దేవుని సేవించినట్లు చూడగలము. అదేవిధముగా మన మందరము దేవుని సేవించడములో మరణము వరకు నమ్మకంగా ఉండాలి. ఈ రీతిగా అన్నివిషయములలో మరణము వరకు నమ్మకంగా ఉన్న యెడల జీవకిరీటమును పొందుదుము.

కాగా నా ప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువు నందు వ్యర్థము కాదని యెరిగి, స్థిరులును, కదలనివారును ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులై యుండుడి (1 కొరింథీ 15:55).

—వి.జె. బెన్‌సన్, హైదరాబాద్.

# 13

# బాప్తిస్మము - నిరీక్షణ

## *( Baptism and Hope )*

"మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడును గాక, మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుటవలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు...ఆయన తన విశేషకనికరము చొప్పున మనలను మరల జన్మింపజేసెను" (1 పేతురు 1 : 3-4).

జీవముతో కూడిన నిరీక్షణ యను ఈ నిరారణను క్రైస్తవుడు తన హృదయంలో ఆదరణకరమైన సహచారిగా ఎల్లప్పుడు యుంచుకొంటాడు. అట్టి నిరీక్షణ నిరాశ నిస్పృహాల ఫలితం కాదు గాని, క్రీస్తునందున్న వారిని దేవుడు సమృద్ధిగా దీవించుననే ఒప్పుకోలు. జీవముతో కూడిన నిరీక్షణను మానవుడు కలిగి యుండునట్లు దయ చేసిన దేవుని స్తుతించుచు పేతురు తన పత్రిక నారంభించాడు. నూతన నిరీక్షణ కలిగియుండుటకు ముందు నూతనారంభముండాలని దేవుని కృప ఆదేశించింది. ఒకడు క్రీస్తులో నూతన జీవితాన్ని బాప్తిస్మమనే క్రియలో ఆరంభిస్తాడు (గలతీ 3:27). గనుక బాప్తిస్మము నిరీక్షణ ద్వారమై యున్నది.

బాప్తిస్మములో విశ్వాసి క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానములయందు పాలి భాగస్థుడౌతాడు. ఆ క్రియలో ఏమైతే సారూప్యముగ నున్నదో బాప్తిస్మము దానిని విశ్వాసిలో క్రియారూపకంగా జరిగించి చూపించుచున్నది. విశ్వాసి మరణిస్తాడు, సమాధి చేయబడ్తాడు, క్రీస్తులో నూతన జీవితం కలిగి జీవించునట్లు తిరిగి లేస్తాడు (రోమా 6:4).

ఈ ఆత్మీయ పునరుత్థానములో దేవుని శక్తిని చవిచూచిన తరువాత, నూతన క్రైస్తవుడు జీవముతోకూడిన నిరీక్షణకొరకు

సంసిద్ధుడౌతాడు. లోకంలో అతనికి ఏవిధమైన నిరీక్షణ లేదు. సాతాను లోకంలో సహజంగాయున్న మరణాన్ని బట్టి, క్షయతను బట్టి అది నాశనం చేయబడింది. అంధకార సంబంధమైన శక్తులనుండి విడుదల చేయబడి క్రీస్తు రాజ్యములోనికి మార్చబడిన క్రైస్తవునికి ఈ లోకంలో నూతన మార్గం చూపించబడింది. అది నిరీక్షణ మార్గం.

ఈ నూతన నిరీక్షణ ఇప్పుడు, ఇకముందు కూడ యున్నది. క్రైస్తవుడు ఆత్మీయాశీర్వాదముల ప్రథమ ఫలముల ననుభవిస్తూ, ఇకముందు రాబోవు వాటి కొరకు నిరీక్షిస్తు యుంటాడు. బాప్తిస్మము క్రైస్తవ జీవితమునకు నాంది యగును; అయినను క్రీస్తునందు బలవంతుడగుటయే క్రైస్తవుని జీవిత ధ్యేయమగును. బాప్తిస్మము ఒకని నిత్యజీవితంలోనికి ప్రవేశపెట్టును; అయినను యుగాంతమందు దేవుని సంపూర్ణ మహిమ బయలుపరచబడు నిమిత్తము క్రైస్తవుడు కనిపెట్టును (యోహాను 5:24; ఎఫె 2:4-6; తీతు 2:13). బాప్తిస్మము సజీవమై, అభివృద్ధి జెందుతూయున్న నిరీక్షణకు మార్గము తెరచును.

దేవునితో క్రైస్తవునికి గల సంబంధాన్ని, అతని నిత్య గమ్యాన్ని గ్యారంటీ చేయునదే క్రైస్తవుని వ్యక్తిగత నిరీక్షణ. తాను భయపడుచున్న వేళ క్రైస్తవుడు తన బాప్తిస్మమువైపు వెనుకకు చూచి దేవుని శక్తిని ప్రేమను గమనించుకోవచ్చును. బాప్తిస్మములో క్రైస్తవుడు పాపముయెడల మరణించి, పునరుత్థానమును అనుభవించియున్నాడు. క్రైస్తవునికి క్రీస్తులో విజయం హామీ చేయబడింది గనుక ఇక ఎన్నడు మరణము ఒక గొప్ప శత్రువు కానేకాదు. దేవునితో అతనికి గల సంబంధము సురక్షితంగానే యున్నదని కూడ అతడెరుగును. బాప్తిస్మములో క్రైస్తవుడు తనలో జీవించు ఆత్మను తన నిత్యస్వాస్థ్యమునకు సంచకరువుగా దేవుని నుండి పొందియున్నాడు (ఎఫెసీ 1:13, 14). ఈ నిత్య సహవాసి కుమారత్వమును గూర్చిన

నిర్ధారణను, భవిష్యత్కాలపు మహిమను గూర్చిన నిరీక్షణను ఇచ్చుచుండును. క్రైస్తవుడు గంభీరమైనదానిలో ఒక భాగము: "మన మందరము ఒక్క శరీరములోనికి బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథీ 12:13). నూతన సృష్టియైనవారే క్రీస్తు శరీరము (2 కొరింథి 5:17). వారు భూమిపై క్రీస్తు చిత్తాన్ని నెరవేర్చుచు, ఆయన రాకకొరకు కనిపెట్టుచుండగా వారొకే నిరీక్షణను కలిగియున్నారు. నిరీక్షణలేని వారితో నిరీక్షణ వర్తమానాన్ని పంచుకొనేటట్లు ఈ నిరీక్షణ వారిని నడిపించును. వారు పవిత్రమైన జీవితాన్ని జీవించుచు, ఒకరినొకరు ప్రోత్సహించుచు, సత్క్రియల యందాసక్తి కలిగియుందురు. వారు క్రీస్తుకొరకు కనిపెట్టుచున్నవారు (1 యోహాను 3:2, 3; హెబ్రీ 10:19-25). ఈ విశ్వాసదళము విశ్వాసముతో కృషి చేయును, కనిపెట్టును. ఈ సహవాసములోనికి వారి బాప్తిస్మము వారిని ప్రవేశపెట్టింది. దానిలో వారు ఆనందింతురు.

బాప్తిస్మము నిరీక్షణ! ఒకని నూతనవ్యక్తిగా సృజించునట్లు దేవుని శక్తి వాని జీవితంలో పనిచేయును. దేవుడు క్రీస్తునందు జరిగించిన దానిని బట్టి, దేవుడిచ్చిన ఆత్మవరమును బట్టి, సంఘముద్వారా క్రీస్తు పరిచర్యను కొనసాగించుటను బట్టి క్రీస్తునందున్న ఈ నూతన వ్యక్తి నిజమైన నిరీక్షణ కలిగియుంటాడు. భయము పారద్రోలబడింది. దేవుని పక్షమున చేరిన వానికి ఉన్న దీవెనకరమైన ధన్యత నిరీక్షణ. —ఎడ్డీ షార్ప్.

---

## క్రీస్తులోని ఆశీర్వాదములు

## (*Blessings in Christ*)

### 1. క్రీస్తు పరిపాలన :-

దేవుని రాజ్యమునకు రాజైన యేసుక్రీస్తు నిత్యుడగు తండ్రి

కుడిపార్శ్వమున నీతియను రాజదండముతో కూర్చుండి యున్నాడు. ఆయన విశ్వాసులైన పౌరుల హృదయాలపై ప్రస్తుతము తన ఆధిపత్యమును నెరవేర్చుచున్నాడు. యేసు రాజును మరియొక శక్తి జయించునను అపాయము లేదు (ఎఫెసీ 1:20-21). ఆయన తన రాజ్య పౌరులకొరకు ఏమిచేయ ప్రారంభించి యున్నాడో దానిని సంపూర్తి చేయుటకు ఆయన సమర్థుడై యున్నాడు. ఈ రాజునందు ఆయన రాజ్య పౌరులు విశ్వాసముంచిరి. ఎందుకంటె వారు తన రాజ్య పౌరులు అగుటకై ఆయన తన రక్తమును ధారపోసెను మరియు తన రక్తమిచ్చి రాజ్య పౌరులను అంధకార సంబంధమైన అధికారి బానిసత్వమునుండి వారిని విడిపించియున్నాడు (కొలస్స 1:13-14).

## 2. క్రీస్తు ప్రధాన యాజకత్వము :—

ఈ రాజ్యమునందు మరియొక అసాధారణ విషయము ఏమంటే ఈ రాజు ప్రధాన యాజకుడుగా పని చేయుచున్నాడు. ఆయన తన రాజ్య పౌరులనిమిత్తము తన మరణములో చిందించిన రక్తముతో తండ్రి సన్నిధిలోనికి ప్రవేశించి పాప క్షమాపణ పొందగోరు వారి పాపములు క్షమింపజేయగలడు (హెబ్రీ 8:1-3; అపొ. కార్య 8:22). ఈ రాజ్యములో అందరి మనుష్యుల గత పాపములను దేవుడు తన మనస్సునందు మరచిపోయెను (అపొ. కార్య 3:19). వాటిని ఆయన తిరిగి ఎన్నడు జ్ఞాపకము చేసుకొనడు (హెబ్రీ 8:12). మరియు రాజ్య పౌరులు దేవుని నీతిని పొందు ఒక విశిష్టమైన విధానమును కలిగియుందురు. అటువంటి విధానము ఏ రాజ్యమునందును లేదు. పౌరులు విశ్వాసమువలన నీతిమంతులుగా తీర్చబడుదురు (ఫిలిప్పీ 3:9). వారిలో ఎవరు తమ రాజు యొక్క రక్తమును విశ్వాసము వలనను, మారుమనస్సు వలనను మరియు ప్రార్థించుట వలనను ఉపయోగించుకొనుట వలనను వారి

పాపములను గూర్చి లేక బలహీనతలను గూర్చి చెడుగా అనుభూతిని చెందనవసరము లేదు.

3. పరిశుద్ధాత్ముడు :-

ఈ రాజ్యమునందలి ప్రతి పౌరుడు రాజైన క్రీస్తుయొక్క స్వభావమును తమయందు పెంపొందించుకొనుట రాజ్యపు కార్యక్రమమై యున్నది. ఈ కార్యక్రమము కొనసాగుటకై రాజులాంటి వ్యక్తి వారిలో జీవించుటకును మరియు సహవాసము చేయుటకును వచ్చెను. ఆయన పరిశుద్ధాత్ముడని పిలువబడుచున్నాడు (1 కొరింథి 6:19, 2 కొరింథి 3:3).

4. దేవుని వాక్యము :-

ఈ రాజ్యపు పౌరులు ఎవరికివారు వారి సొంత చట్టములను చేయరు. ఎల్లవేళల యందును సకల ప్రజలకు వర్తించు జీవిత నియమాలను దేవుడు వారికిచ్చి యున్నాడు (రోమా 8:2). సామాన్యముగా అందరూ బైబిలు యని పిలుచుచున్న గ్రంథమునందు అవి వ్రాయబడి యున్నవి (2 తిమోతి 3:16).

5. క్రీస్తు సంఘ సహవాసము :-

దేవుని రాజ్యపు పౌరులమధ్య ఒకరికొకరికి మధ్యగల సంబంధము విశిష్ట లక్షణమును కలిగియున్నది. వారు ఒకరికొకరు అవయవములై యున్నారు (రోమా 12:5). ఈ విధముగా వారు రాజునకు శరీరమై యున్నారు. క్రీస్తు వారికి రాజై యున్నందునను మరియు ఆయన వారిని సాతాను రాజ్యమునుండి పిలిచినందువలనను వారు తమ్మును తాము క్రీస్తు సంఘముగా గుర్తించిరి [(రోమా 16 : 16; అపో. కార్య 26:18). —S.J. బెన్‌హర్, రాజమండ్రి.

# సాతాను స్థితి గతులు

(గత సంచిక తరువాయి)

ఈ దిగువ నుదహరించిన పేర్లతో సాతానుడు చలామణి అవుచున్నాడు :

1) అపవాది (ఎదుటవారిపై అపవాదులు వేయువాడు) (ఎఫెసీ 6:11; 1 తిమోతి 3:6).
2) ధర్మవిరోధి (అసలు అందర్కీ విరోధే) (2 థెస్స 2:3).
3) పాప పురుషుడు
4) నాశన పాత్రుడు | 2 థెస్స 2:3.
5) అబద్ధికుడు
6) అబద్ధాల జనకుడు
7) నరహంతకుడు | యోహాను 8:44
8) వెలుగు దూత (2 కొరింధి 11:13-15).
9) క్రీస్తువిరోధి (వీడొక్కడే కాదు, వాక్యానుసారం నడవని వారందరు) (1 యోహాను 2:18)
10) శోధకుడు (మత్తయి 4:3).
11) అపవిత్రాత్మ (పవిత్రతలేని ఆత్మగలవాడు) (మార్కు 9:26).
12) సాతాను, సైతాను (తాను సై లేక సా అంటాడు) అనగా, సై అని చెప్పి సాధిస్తాడు. గాని, ఏమి చేయలేక తొలగిపోతాడు. తాను పై నుదహరించిన అన్ని నామములు కలిపి, ఒకటి వాడుక నామము. అదే సాతాను :

ఈ నాశనపాత్రుడు తన మొదటి ప్రయోగమును ఆదామవ్వలపై ప్రయోగించెను. వారిని పాపములో పడవేసి నాశనము చేసెను. సామెతల గ్రంథకర్త అన్నట్లు, నాశనమునకు ముందు గర్వము వాడిలో నడచినది గాన నాశనమైనాడు. దేవుని సహవాసమందున్న

వాడే. దేవదూతల సమూహములో నున్నవాడే పడద్రోయబడి ఆనాటినుండి మన దేవుని ఎదుట మన సహోదరులపై నేరము మోపు వాడు వీడే (ప్రకటన 12:9). ఈనాడు కూడా అదే ప్రకారం మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించువారు (మత్తయి 15:9) క్రీస్తు విరోధులని చెప్పవచ్చును. ఏవ్యక్తియైనను, బోధకులైనను, సంఘమైనను, క్రీస్తు చిత్తమునకు, వాక్యమునకు వ్యతిరేకముగా నడచువారిని క్రీస్తు విరోధులని అనక తప్పదు.

## సాతాను పని

ఈ నరహంతకుని పని కొంతవరకు చూచెదము. ఎక్కువ కాలము వీడు త్రాగుబోతులతోను, జూదగాండ్లతోను, వ్యభిచారులతోను గడుపడు. వానికి సమయము బహు కొద్దిగా యున్నది. వారి జోలికి పోడు. ఎందుకంటే వార్ని ప్రోత్సహించకుండగనే వారాపనులు చేయుచుండుట చూచి సంతోషించుచున్నాడు. క్రీస్తునం దెవరు జీవించుటకు ప్రయత్నింతురో వార్ని పడద్రోయుటకే ప్రయత్నించును.

మతపరముగా సాతాను ఎక్కువగా పనిచేయుచున్నాడు. క్రీస్తు పేరు చెప్పే ఏ సమాజమైనా, ప్రార్థనాగృహమైనా, ఏ సహవాస కూటమైనా, క్రీస్తు పేరు ముఖాంతరంగా కాక, ముఖాముఖిగా ఉచ్చరించే క్రీస్తు సంఘమనే పేరు వింటే మండిపడిపోతాడు. క్రీస్తు పేరు వానికి ఇష్టముండదు. అందుచేత క్రీస్తు సంఘాలపై మతశాఖలవార్ని ఎదురు త్రిప్పి, ఒకరినొకరు పరస్పర విరోధముతో యుండులాగున ప్రోత్సహించి, వారిలో వారికి సిద్ధాంతరీత్యా గిట్టక ఒండొరులు పోట్లాడుకొనునట్లు చేయుచున్నాడు. జనముమీదికి జనమును రేపుట వాని పని యని ఇప్పటికైనా గ్రహించి, క్రీస్తుకు మహిమ కలుగకుండా దూషణపాలు చేయుచుండుటే వాని బిజినెస్. మానవరూపమున అంతలో కనబడి, అంతలో మాయమగును.

సాతానుకు కూడా తన స్వంత సంఘాలున్నవి. 1 కొరింధి 6:9; ప్రకటన 21:8 లోని జాబితాలోని వారందరు వాని సంఘం, సంఘస్తులు కూడా.

సాతానుకు వేదాంత పాఠశాలలు కూడా యున్నవి. ప్రకటన 2:24లో సాతాను యొక్క గూఢమైన సంగతులని యున్నవి. గూఢమైన అను మాటకు లోతైన భావములుగల సంగతులు అని అర్థము. అట్టి భావములు తెలుపు స్థలములున్నట్లు మనకు తెలియుచున్నది.

సాతానుకు కూడా ఒక రాజ్యమున్నది. అది అంధకార సంబంధమైన రాజ్యం (కొలస్స 1:13). యిప్పుడు మనము అంధకార సంబంధమైన రాజ్యంనుండి విడుదల పొంది తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులుగా యున్నాము.

మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులని క్రీస్తు పల్కెను (యోహా 8:44). పైనుదహరించిన దాని క్రియలకు లోబడిన వారందరు దాని సంబంధులు. అనగా కుమారులు, కుమార్తెలు.

ప్రియ సోదరీ, సోదరుడా, వాక్యానుసారం జీవించి, వాక్యానికి విధేయుడవు కమ్ము. క్రీస్తును శోధించినపుడు సాతాను వాక్యమే ఉపయోగించెను. ప్రభువువారు కూడా వాక్యంతోనే బుద్ధి చెప్పెను. ఈనాడు మనము కూడా ఆ వాక్యము ప్రకారమే జీవించెదము గాక. బైబిలు దేవుని మాటలు మనుష్యుని మాటలు మనకు వద్దు.

(సమాప్తం)

## కోపము

## (*Anger*)

కోపమనగా వివేకం కోల్పోవుట అని అర్థము. కోపమునకు

మరియొక పర్యాయపదముకలదు. దానినే ఆగ్రహమని అందుము. సహజముగా కోపము అందరిలోను ఉండును. కోపమునకు స్త్రీలని, పురుషులని, పేదవారని, గొప్పవారని తారతమ్యములేదు. ఇది అందరి హృదయములో స్థిరనివాసము చేయవలెనని ప్రయత్నించును. అందుచే దైవాత్మ ప్రేరితుడైన దావీదు "కోపము మానుము, ఆగ్రహము విడిచిపెట్టుము" అని పలికెను (కీర్తన 37:8). ప్రియ సహోదరా మన ఇరుగు పొరుగు వారెవరైననూ మనమీద నోరు చేసుకోవచ్చు. దానికి మనం ఉద్రేకం చెందిపోయి కోపం తెచ్చుకొనుట దేవుని దృష్టికి మంచిది కాదు. ఒకరు మనల్ని ద్వేషించారంటె మనవలన ప్రత్యక్షముగానో మనకు తెలిసో తెలియకో వారికి అపకారం సంభవించి ఉండాలి! లేదా మనల్ని వారు అపార్థం చేసుకొని ఉండాలి. కనుక మనము సహనభావముతో కొంచెము ఓపిక పట్టుట మంచిది. "మితముగా మాటలాడువాడు తెలివిగలవాడు శాంతగుణము గలవాడు వివేకము గలవాడు" (సామె 17 : 27) అని దైవగ్రంథము నుడువుచున్నది. కోపంతో మనం ఉద్రేకం చెందినపుడు మన శరీరంలో 40 కండరాలు పనిచేయాలి. చిరునవ్వు నవ్వితే 15 కండరాలు పనిచేస్తాయి. మనము అనవసంగా ఎందుకు శ్రమపడిపోవాలి? ఎందుకు అనవసరంగా శక్తిని వ్యర్థం చేసుకోవడం !

**దేవుని కోపము ఎట్టిది? :—** దేవుని కోపము ఎట్టిదనిన ఆయన కోపము వాత్సల్యతగల కోపము (కీర్తన 77:9). బిడ్డలయెడల తలిదండ్రులు చూపునట్టి ప్రేమగల కోపము. "నా కుమారుడా, యెహోవా శిక్షను తృణీకరింపవద్దు. ఆయన గద్దింపునకు విసుకవద్దు. తండ్రి తన కిష్టుడైన కుమారుని గద్దించు రీతిగా యెహోవా తాను ప్రేమించువారిని గద్దించును" (సామె3:11-12). ఆయన కోపము నిముష మాత్రముండును (కీర్తన 30 : 5). ఆయన దయాదాక్షిణ్యపూర్ణుడు, దీర్ఘశాంతుడు, కృపాసమృద్ధిగలవాడు, ఆయన ఎల్లప్పుడు వ్యాజ్య

మారువాడు కాడు. "ఆయన నిత్యము కోపించువాడు కాడు మన పాపములను బట్టి మనకు ప్రతీకారము చేయలేదు. మన దోషములనుబట్టి మనకు ప్రతిఫలమియ్యలేదు" (కీర్తన 103 : 8-10). అంతేగాక మనలను అధికముగా ప్రేమించి పాపపు బానిసత్వమునుండి విడిపించుటకై తన ఏకైక కుమారుడైన క్రీస్తును ఈ లోకమునకు పంపెను (యోహాను 3:16-17). దేవుడు మనపై కోపపడుటకు ఆయనకు అధికారమున్నది. దేవుని కోపములో న్యాయమున్నది.

**మానవుని కోపము** :-మనము కోపము కలిగియుండుట వలన పాపము చేయుటకు అవకాశమున్నది. కనుకనే దేవుడిట్లు హెచ్చరించుచున్నాడు : "కోపపడుడి గాని పాపము చేయకుడి; సూర్యుడస్తమించిన పిమ్మట మీ కోపము నిలిచియుండకూడదు" (ఎఫెసీ 4:26). కోపము పాపమునకు మార్గమేర్పరచును. ఆ పాపపు మార్గము వలన మరణమను గమ్యము లభించును. మనము ఆదికాండము 4వ అధ్యాయము 4వ వచనమునుండి 8వ వచనము వరకూ పఠించినట్లయితే అందుట్లున్నది : యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను; కయీనును అతని యర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి తన తమ్ముడైన హేబెలుమీద పడి అతనిని చంపెను. కయీనుయొక్క కోపము అతనిని తొలి హంతకునిగా మార్చినది. అంతేకాక అతని సహజ భావమును నశింపజేసినది. దేవునిచే శపించబడి దేశదిమ్మరిగా తిరుగు నీచ పరిస్థితికి దిగజార్చినది. కనుక "నా ప్రియ సహోదరులారా, మీరీ సంగతి ఎరుగుదురు గనుక ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడువాడును, మాటలాడుటకు నిదానించువాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను. ఎందుకనగా నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు" (యాకోబు 1:19,20).

దేవుని కోపమును చల్లార్చుటకై ఆయన సన్నిధిని నిలచి అడ్డు

పడిన మోషే. (కీర్తన 106:23) భూమి మీద నున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడని దేవునిచే పిలువబడిన మోషే. (సంఖ్యా 12:3), దేవుని యిల్లంతటిలో నమ్మకమైన వాడన్ని దేవునిచే పొగడబడిన మోషే కోపముతో దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులను ద్రోహులారా అని నిందించి దేవుడు వాగ్దానము చేసిన పాలు తేనెలు ప్రవహించు కనాను దేశములో ప్రవేశించు అవకాశమును కోల్పోయెను. మోషే ఎంతటి సాత్వికుడైనను కోపము వలన పాపము చేసెను. ఆజ్ఞను అతిక్రమించెను (సంఖ్యా 20వ అధ్యాయము). కనుక ప్రియ సహోదరా, నీ వెంతటి గొప్ప బోధకుడవైనను, ఎంత గొప్ప విశ్వాసివైనను నీలో కోపమున్నట్లయితే నీ భక్తి అంతయు వ్యర్థమే.

స్తెఫనుయొక్క దివ్య ప్రేరితమైన వాక్కునకు అత్యాగ్రహము తెచ్చుకొని అతనిని చూచి పండ్లు కొరికి పెద్ద కేకలు వేసి చెవులు మూసుకొని యేకముగా అతని మీద పడి పట్టణపు వెలుపలికి అతనిని వెళ్ళగొట్టి రాళ్ళు రువ్వుతున్నప్పటికి ఆనాటి ప్రజలపై స్తెఫను కోపగించలేదు సరికదా మన రక్షకుడైన క్రీస్తువలె "వారి మీద ఈ పాపము మోపకుమని గొప్ప శబ్దముతో పలికెను" (అపొ.కా. 7:60).

ఓ క్రైస్తవ సోదరా, ఈనాడు నీ పరిస్థితి ఎట్లున్నది? నీ ఇరుగు పొరుగు వారిని, నీ తోటి సువార్తికులను, సంఘ సహోదరి సహోదరులను ప్రేమించు చున్నావా లేక కోపించుచున్నావా? బోధకుడవైన నీవు నీ తోటి బోధకులు ప్రసంగించుచుండగా ఈర్ష్యాభావము కలిగి పెద్ద కుమారునివలె ఆరాధన మధ్యలో లేచి వెళ్ళిపోవుచున్నావా? లేక నిన్ను నీవు ప్రభువునందు తగ్గించుకొనుచున్నావా? నీ కంటె చిన్న వారిని ప్రోత్సహించుచున్నావా లేక వారిని అపహాస్యము చేయుచున్నావా? ఒక్కసారి నిన్ను నీవే ప్రశ్నించుకో. సంఘమునకు శిరస్సు క్రీస్తని, సంఘ స్థాపకుడు క్రీస్తని బోధించినపుడు నీవు కోపించుట

కంటె దేవుని వాక్యమును విపులముగా పఠించి సత్యమును తెలుసుకొనుట ఉత్తమము. అంతేకాదు మనము సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వమును విసర్జించాలి (ఎఫెసీ 4:31; 1 పేతురు 3:15; హెబ్రీ 10:26; సామె 28:13). నీవు ఇంకనూ కోపము కలిగియుంటె నీ కోపమును విడిచిపెట్టి ప్రభువునందు విశ్వసించి మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది ఆయన సంఘము (క్రీస్తు సంఘుం) తో చేర్చబడి ఆయన దీవెనలు పొందుము.

—P. చంద్రశేఖర్, ధవలేశ్వరం.

---

## సాత్వీకము

### (*Humility*)

"దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును అని లేఖనము చెప్పుచున్నది" (యాకోబు 4:6). "నేను సాత్వీకుడను, దీన మనస్సు గలవాడను" అని యేసు తన్ను గూర్చి చెప్పుకొన్నాడు (మత్త 11 : 29). సాత్వీకము వలన ఒకడు తన్ను తాను తగ్గించుకొనును. అహంకారుడు తన్ను తాను హెచ్చించుకొనును.

మేడ గదిలో యేసు ఒక బానిసవలె అయ్యాడు. దీనమనస్సు యొక్క భావాన్ని కార్యం చేసి చూపించాడు. ఆయన "భోజన పంక్తిలో నుండి లేచి తన పైవస్త్రము అవతల పెట్టివేసి, ఒక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను. అంతట పళ్లెములో నీళ్లు పోసి శిష్యుల పాదములు కడుగుటకును, తాను కట్టుకొనియున్న తువాలుతో తుడుచుటకును మొదలు పెట్టెను" (యోహాను 13 : 4, 5). మనము అట్టి దీనత్వము కలిగియుండాలని క్రీస్తు మనకు బోధించాడు. "కాగా

ఈ బిడ్డవలె తన్ను తాను తగ్గించుకొనువాడెవడో, వాడే పరలోక రాజ్యములో గొప్పవాడు" (మత్త 18:4).

ఇట్టి సాత్వీకము గల దాసుని సంతోషము అహంకారము వలన విషమయము కాగలదు. ఏదైనా తక్కువ పని మనకు అప్పగింపబడితే, దాన్ని నిరాకరిస్తాము. అది నా పని కాదు, నీది, నీవు చెయ్యి అని ఎదురాడ్తాము. మన అహంభావము దెబ్బతింటాదని అనుకొనుట వలన అనేక సహాయ కార్యక్రిమాలు అమలు పరచబడకనే యుంటాయి. క్రీస్తు "మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెనని" మనము మరచిపోతాము (ఫిలిప్పీ 2:8).

సాత్వీకమును గూర్చి ఆలోచించుచుండగా ఈ దిగువ నీయబడిన వ్యక్తుల జీవితాల్లో ఈ గుణం సహజంగా ఎట్లున్నదో గమనించుము: అబ్రహాము (ఆది 18:27), మోషే (నిర్గ 3:11), దావీదు (2 సమూ 7:18), సొలొమోను (1 రాజులు 3:7), యెషయా (యెష 6:5), యిర్మియా (యిర్మి 1:6), దానియేలు (దాని 2:30), బాప్తిస్మమిచ్చు యోహాను (యోహా 1:27), యేసు తల్లియైన మరియ (లూకా 1:28), మరియు పౌలు (ఎఫెసీ 3:8). వీరందరు దేవుని గొప్ప సేవకులు. వారి జీవితమంతా దేవునికి కృతజ్ఞత పూర్వకమైన పరిచర్యలోనే గడిచిపోయింది.

ప్రార్థన పూర్వక జీవితం, దీనమనస్సు రెండు కలిసే యుంటాయి (కీర్త 10:17). దీనుల జీవితాలను మేలైన సంగతులతో నింపుటలో దేవుడు ఆనందిస్తాడు. అహంకారంతోను, ఆడంబరముతోను నిండిన వారికి దేవుడు నిస్సహాయుడు. అయితే దీనుల మొరను ఆయన మరువడు (కీర్త 9:12). "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట వినయమునకు ప్రతిఫలము. ఐశ్వర్యమును ఘనతయు జీవమును దాని వలన కలుగును" (సామె 22:4).

—— —టామ్ కెల్లర్.

# అద్వితీయుని ఆరాధించుటకు గొప్ప అవకాశము

చక్కని భావభరితమైన, శ్రావ్యమైన సంగీతములు గల అందమైన ప్రింటింగుతో 284 పాత క్రొత్త క్రైస్తవ కీర్తనలు గల పుస్తకములు సిద్ధపరచబడి యున్నవి. మీ కుటుంబములోను, సంఘములోను ప్రభువును స్తుతించుటకు తగియున్నవి. పుస్తకము ఖరీదు 6-00 రూ॥లు. పోస్టల్ చార్జి 0-50 పై॥లు అదనం. డబ్బు పంపినవారికి అందజేయగలము.

వలయువారు ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి.

**CHURCH OF CHRIST**
C/o T. Prakasa Rao
Gopalunipalli, (via) KOMAROLE-523 373

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To